

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహాలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

### - 67 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

'ఇది తుపాకులు, మందుగుండు భద్రపరచిన గిడ్డంగి. అదనంగా రెండు వేలమంది సిపాయిలకు సరిపోను తుపాకులు ఉన్నాయి. అంటే నాలుగు వేల తుపాకులు!' తన ముందున్న యువకుల ముఖాలలోకి పట్టి పట్టి చూస్తూ తాపీగా చెప్పాడు నాగులు. ఎవరి ముఖంలోనూ యేమాత్రమూ ఉలికిపాటు కనపడలేదు. అవునా అన్నట్టు తలలూపారు, అవసరమైన సమాచారం అందుకున్నట్టు.

నాగులు ముందు శుభ్రంగా ఆవు పేడతో అలికిన నేలమీద నాగులవంచ దచ్చివారి స్థావరం నమూనా ముగ్గులతో చిత్రించబడి ఉన్నది. కళ్ళముందు పిడుగు పడ్డట్టు కంపించిపోయాడు నాగులు తండ్రి గోపులు. 'నాలుగు వేల తుపాకులు! రెండువేలమంది సైనికులు! అంత పెద్ద గిడ్డంగి సగానికి మందుగుండు! మనం రెండొందల మందిమి కూడా

లేము! రోకళ్ళు, బరిసెలు, కర్రలతో తుపాకులు పట్టుకున్న రెండువేల మంది సైనికులను ఎదుర్కోగలమారా అయ్యా!' తోట మొత్తం కలయజూస్తూ వణుకుతున్న గొంతుతో కొడుకును ప్రశ్నించాడు.

కళ్ళముందు గెలుపు కనిపిస్తున్న వీరుడిలా చిద్విలాసంగా నవ్వాడు నాగులు. 'నిన్న రాత్రికల్లా వెయ్యి తుపాకులు మాయం చేశాము. మందుగుండును చక్కంగా నానబెట్టి శ్రావణమాసం శనగల్లాగా చేస్తాము. తుపాకీమందు తుస్సుమంటుంది' నాగులు కళ్ళు చుక్కల్లాగా మెరిశాయి. కొడుకును ఆశ్చర్యంగా చూశాడు గోపులు.

'కన్నెవీడు, దబ్బాకుపల్లి, వత్సవాయి, బొమ్మకల్లు, పెద్దబీరవోలు, నారాయణపురం, చిర్నోముల, ముష్టికుంట్ల, నాగులవంచ, చింతకాని, పాతర్లపాడు, లక్ష్మీపురం, తిమ్మినేనిపాలెం, ముదిగొండ, ముత్తారం, నేలకొండపల్లి, తల్లంపాడు, స్థంభాద్రి,  ఒక్కొక్క ఊరినుండి వందమంది వోలందులోళ్ళ బొంద పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు' ఒక్కొక్క దెబ్బ వేసి మోగిస్తున్న యుద్ధభేరిలాగా మోగింది నాగులు గొంతు.

'ఇది పద్దెనిమిది దళాల పద్దెనిమిది పర్వాల నాగులవంచ మహాభారత యుద్ధం! మూడవ ఝాముకు ముట్టడి ప్రారంభం. కోడికూసే వేళకు స్వేచ్ఛా కిరణాల కొత్త ఉదయం! ఇక మన భూములు, మన పంటలు మనవే! మన కష్టానికి ఫలితం మనదే!' మంత్ర ముగ్ధులను చేస్తున్నట్లు మధురంగా పలుకుతున్నది నాగులు కంఠం. ఎదురు రొమ్ములు, భుజాలు పొంగుతుండగా, కళ్ళల్లో కదన కాంక్ష మిరుమిట్లు కొలుపుతుండగా వింటున్నారు నాగులు ముందు కూర్చున్న ముప్పై ఆరుమంది యువకులు. వాళ్ళు పద్దెనిమిది దళాల దళపతులు, ఉప దళపతులు. దక్షయజ్ఞ ధ్వంసానికి బయల్దేరిన వీరభద్రుడి గణపతుల ప్రతి రూపాల్లా ఉన్నారు వాళ్ళు.

మొట్టమొదటిసారిగా కొడుకులో కొత్త రూపాన్ని చూస్తున్నాడు గోపులు. సంభ్రమంగా చూపులతోనే నిలువెల్లా తడుముతూ చూస్తున్నాడు. అతడి ముఖంలో సంభ్రమం స్థానంలో చిరు గర్వం, సంతృప్తి కనిపిస్తున్నాయి. ఆ ఉదయం దచ్చివారి పంచన చేరిన నమ్మకద్రోహిని అంతం చేసిన తర్వాత అమ్మవారికి కొలుపులు జరిగాయి. భోజనాల అనంతరం ముఖ్య సమావేశం జరుగుతున్నది ప్రస్తుతం.

'మన పద్దెనిమిది దళాల పద్దెనిమిది వందల వీరులతో రెండువేలమంది సైనికులను ఎదుర్కోవాలి. వాళ్ళ దగ్గర మూడువేల తుపాకులున్నాయి.  మరలా తుపాకీ మందు దట్టించుకోడానికి అవకాశం లేకుండా చేయాలి. పాకులు

పేల్చే అవకాశం లేకుండా దాడి జరగాలి. ధైర్యంతోపాటు సమయ స్ఫూర్తి చూపితే ప్రాణ నష్టం లేకుండా సునాయాసంగా గెలుస్తాము' నాగులు కంఠం మంత్రోపదేశం చేస్తున్నట్లు పలుకుతున్నది.

'మనం అంతం చేసిన డచ్చివారి తొత్తు సాయంత్రానికో, రేపు ఉదయానికో ఆ గుంటనక్కలు లూసిఫర్, బీల్జిబబ్ లను కలిసి సమాచారం అందిస్తాడు అని ఎదురు చూస్తుంటారు. అందుకనే రాత్రి మూడో జాము ఎనిమిది ఘడియలలో మొత్తం జరిగిపోవాలి. మన ప్రధాన లక్ష్యాలు తుపాకులు, తుపాకీ మందు గిడ్డంగి' మన గెలుపుకు ఓటమికి మధ్యన ఇన్నవి ఈ రెండే. వీటి బాధ్యత తీసుకునేవాళ్ళు ఎవరు?' ఒక్కొక్కరినే పట్టి పట్టి చూస్తూ ప్రశ్నించాడు నాగులు.

'నేను!' నాగులు మాట పూర్తి అయ్యీ  కాకముందే రొమ్ము చరుచుకుని పర్వతంలా లేచి నిలబడ్డాడు ముత్తవరం దళపతి మొండి జగ్గడు. ఏమాత్రమూ సందేహం లేకుండా తనూ లేచి నిలుచున్నాడు ఉప దళపతి వీరభద్రాచారి.

'తుపాకీ మందు గిడ్డంగిని, తుపాకులుంచిన గిడ్డంగిని ఐదు వందల మంది తుపాకులతో కావలి కాస్తున్నారు  ఈ వారం రోజులనుండీ. కోటను, కార్యాలయాన్ని కలిపి మరొక ఐదువందలమంది కావలి కాస్తున్నారు. మిగిలిన వేయిమంది ఎప్పటికప్పుడు సిద్ధంగా వుంటున్నారు' అందరూ మౌనంగా శ్రద్ధగా వింటున్నారు. కొంతసేపు మౌనం తరువాత నాగులు కొనసాగించాడు. 'మనము పద్దెనిమిది వందలమంది మగాళ్ళం ఉన్నాము'

'పొద్దున్నుండీ మా ఊసే ఎత్తడం లేదు. ఆడవాళ్ళం రెండు వందల మందిమి ఉన్నాము. చంపడానికైనా చావడానికైనా మేము సిద్ధం' తోక తొక్కిన త్రాచులా లేచింది నాగమణి. వారిస్తున్నట్లుగా ఏదో చెప్పబోయాడు నాగులు. పడగవిప్పి బుసలు కొడుతున్నట్లు రోషంతో అందరినీ కలయజూస్తూ 'మీతో కలవనీయకుంటే విడిగానైనా మేము పోరాటంలోనే బతకడమో, చావడమో, అంతే!' అన్నది. 'అంతే, అంతే' అంటూ లేచి నిలుచున్నారు పదిమంది మహిళలు.

చిరునవ్వులు చిందిస్తూ 'మీకోసం ముఖ్యమైన పని అట్టే పెట్టి ఉంచాను. మీరు చేతులు కలపకుండా మన గెలుపు ఎలా సాధ్యం?' అన్నాడు నాగులు కూర్చోండి అని సైగ చేస్తూ. ముఖాలు కళకళ లాడించుకుంటూ, చిరునవ్వులు తళతళ లాడించుకుంటూ కూర్చున్నారు వీర మహిళలు.

ఈ వ్యవధిలో తన ప్రణాళికను మనసులో రచించుకున్నాడు ముత్తవరం దళపతి మొండి జగ్గడు. 'తుపాకీ మందును, తుపాకులనునాశనం చేసే పూచీ మాది. ముత్తవరం దళంలో వందమంది పోను మిగిలిన పదిహేడు వందలమందికి వోలందుల వేయిమందిని కడతేర్చడమో, వాళ్ళ చేతులలో కడతేరి పోవడమో కర్తవ్యం' అన్నాడు. గంభీరమైన మౌనం అలుముకున్నది తోట అంతటా.

మిగిలిన పదిహేడు వందలమంది చేయాల్సిన దాడికి ప్రణాళిక రచించడం జరిగింది. మరొకసారి మొదటినుండీ చివరిదాకా చేయాల్సినదానిని చర్చించుకుని నిశ్చయం చేసుకున్నారు. అప్పటికి పగటి మూడవ జాము మొదలైంది. అగ్నిసాక్షిగా వోలందులను నాగులవంచ నుండి పంపడమో చంపడమో చేయకుండా సూర్యోదయాన్ని చూడము అని ప్రమాణాలు చేశారందరూ. ఒకరొకరుగా నిశ్శబ్దంగా నిష్క్రమించారు. నేల మీద వేసిన ముగ్గును ఆనవాళ్ళు లేకుండా చెరిపేసి, అందరికంటే చివర, తండ్రిని వెంటబెట్టుకుని తోటను వదిలి కదిలాడు నాగులు. ముసి ముసి చీకట్లు అప్పుడప్పుడే ముసురుకుంటున్నాయి.

తోటలో ఒక మూల విశాలంగా పెరిగిన చెట్టు మీద గుబురాకుల నడుమ రెండు రోజులనుండీ కంటికి కనబడకుండా నక్కిన ఆకారం నెమ్మదిగా చెట్టు దిగింది. మసక చీకట్లలో కలిసి పోయి నాగులవంచ కోటవైపు నడిచింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS